




అమరావతిలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

గణపతియే నమః

- వాడవాడలా ఘనంగా చవితి ఉత్సవాలు
- స్వామి విగ్రహాల దర్శనాలకు పోటెత్తుతోన్న భక్తులు

నరసరావుపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను జిల్లా అంతటా భక్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా గణపతి సంబరాల కోలాహలం నెలకొంది. ఈ ఏడు వందల సంఖ్యలో మండపాలను ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీలు అట్టహాసంగా పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచే ఆధ్యాత్మిక శోభతో ఆలయాలు, మండపాలు కళకళలాడాయి. వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాలను సుందరంగా అలంకరించి వినూత్న రీతుల్లో స్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండపాల్లో భారీ విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. వివిధ రూపాల్లో తీర్చిదిద్దిన ఉత్సవ మండపాలు, విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి విఘ్నేశ్వరుని దర్శించు కుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మట్టి గణపతిని ప్రతిష్ఠించగా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నేశ్వరస్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇళ్లలోనూ చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా ఘనంగా చవితి వేడుకలను జరుపుకున్నారు.







పిడుగురాళ్ల తారక రామ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడు | నరసరావుపేటలోని కాకుమాను వారి వీధి పందిరిలో భారీ గణపతి విగ్రహం | నరసరావుపేట క్లాత్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన మండపంలో భారీ గణపతి విగ్రహం | రొంపిచర్లలో రామాలయం వద్ద కొలువు దీరిన గణనాథుడు

యూరియా కోసం బారులు

అరకొర పంపిణీతో ఎగబడుతున్న రైతులు

- సరిపడ నిల్వలు ఉన్నాయని అధికారుల ప్రకటన
- క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా అన్నదాతల ఇబ్బందులు
- అవసరానికి మించి కొనుగోళ్లతోనే ఇక్కట్లు అంటున్న అధికారులు
- బ్లాక్ చేసి సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు.. పట్టించుకోని అధికారులు

వర్షాలతో సాగుపనుల్లో నిమగ్నం కావాల్సిన రైతులు ఎరువుల కోసం ఎగబడాల్సి వస్తోంది. ప్రస్తుత అవసరాలకు సరిపోయినంతగా యూరియా అందుబాటులో ఉందని అధికారులు ప్రకటిస్తున్నా.. తమకు దొరుకుతుందో లేదో.. అవసరమైనప్పుడు ఇబ్బంది పడుతామేమోనన్న ఆందోళనలో రైతులు విక్రయ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. సిఫార్సులతో కొందరు అదనంగా కొనుగోలు చేస్తుండటంతో సన్నచిన్నకారు రైతులకు యూరియా అందక అల్లాడుతున్నారు. సహకార సొసైటీలు, రైతు సేవా కేంద్రాల వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరి కనబడుతున్నారు. ఇదే అదనుగా కొందరు యూరియాను బ్లాక్ చేసేస్తున్నారు. 60 శాతం సరఫరా చేసినట్లు అధికారిక గణాంకాలు ఉన్నాయి. అయితే అధికశాతం రైతులు తమకు ఎరువులు అందలేదని ఆరోపిస్తున్నారు.

(దాచేపల్లి, గుంటూరు సిటీ, బాపట్ల, రేపల్లె, కొల్లూరు-ఆంధ్రజ్యోతి)

సాగు విస్తీర్ణంతో బేరీజు వేస్తే ప్రస్తుతం కేటాయించిన యూరియా నిల్వలు మిగులుగా ఉండాలి. కానీ ఆ పరిస్థితి లేకపోగా రైతులు ఇక్కట్లు పడాల్సిన వింత పరిస్థితి గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కనిపిస్తోంది. ఉదాహరణకు బాపట్ల జిల్లాలో సెప్టెంబరు చివరికి యూరియా అవసరాలు 22,000 మెట్రిక్ టన్నులుగా వ్యవసాయశాఖ అంచనా వేసి 13,000 టన్నులు కేటాయించినట్లు చెబుతున్నారు. 27వ తేదీకి గుంటూరు జిల్లాకు 363 మెట్రిక్ టన్నులు, బాపట్లకు 417 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చింది. ప్రస్తుతం గుంటూరు, బాపట్ల జిల్లాల్లోనే యూరియా అవసరం ఎక్కువగా ఉంది. అయితే ఇప్పటికీ యూరియా కోసం రైతులు మూడు జిల్లాల్లోనూ ఎగబడుతూనే ఉన్నారు. ఇదే పరిస్థితి అటు గుంటూరు, ఇటు పల్నాడు జిల్లాల్లోనూ నెలకొని ఉంది. సీజన్‌లో అవసరాలకు సరిపడా (మిగతా 8లో)



కొల్లూరు మండలం గాజుల్లంక పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతుల పడిగాపులు



పొందుగల చెక్ పోస్టు వద్ద విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న యూరియా బస్తాలు

హద్దులు దాటిన యూరియా దందా

పుష్కలంగా ఉన్న ఎరువులను వ్యాపారులు పక్కదారి పట్టిస్తున్నారు. వ్యాపారులు, దళారులు మాఫియాగా మారి యూరియాను ఇష్టానుసారంగా అమ్ముకుంటున్నారు. పల్నాడు జిల్లాలోని దాచేపల్లి, మాచర్ల, రెంటచింతల మాచవరం, పిడుగురాళ్ల మండలాల నుంచి (మిగతా 8లో)

సిగ్నళ్ల ట్యాంపరింగ్‌తో రైళ్లలో చోరీలు


- పిడుగురాళ్ల-నడికూడి మధ్య ఆరు ఘటనలు



తుమ్మలచెరువు రైల్వే స్టేషన్

దాచేపల్లి, పిడుగురాళ్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల, పొందుగుల మధ్య సిగ్నళ్లను ట్యాంపరింగ్ చేసి రైళ్లల్లో చోరీలతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. గత మూడు నెలల్లో ఆరు ఘటనలు జరిగాయి. అయినా రైల్వే అధికారులు నిర్లక్ష్యం వీడటంలేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం తెల్లవారు జామున నడికూడి రైల్వేస్టేషన్ సమీపంలో నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ 146/06 మైలు రాయి వద్ద సిగ్నల్ ట్యాంపరింగ్ చేసిన దుండగులు ఎస్-1, ఎస్-2, ఎస్-3 బోగీల్లో చొరబడి ఇద్దరు మహిళల మెడల్లో ఉన్న 50 గ్రాముల బంగారాన్ని అపహరించారు. ఎస్-5 బోగీలోకి దొంగలు రాగా ప్రయాణికుల కేకలతో పరారయ్యారు. ఆ సమయంలో రైలు అరగంట సేపు నిలిచిపోయింది. సిగ్నల్‌ను ట్యాంపరింగ్ చేసి జూన్ 29న న్యూ పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ సమీపంలో విశాఖ నుంచి చర్లపల్లి వెళ్తున్న రైలు ఆగిపోగా దుండగులు రెండు బోగీల్లో ప్రవేశించి ఇద్దరు మహిళల మెడల్లో గొలుసులు లాక్కొని పరారయ్యారు. ఆ మరునాడే తుమ్మలచెరువు రైల్వేస్టేషన్ వద్ద విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో ఎస్-1, ఎస్-3 బోగీలలో ప్రవేశించిన దుండగులు మహిళల మెడలో బంగారు నగలు అపహరించుకుపోయారు. మరో బోగీలోని ప్రయాణికులు కేకలతో రైల్వే పోలీసులు వారిని వెంబడించగా రాళ్లదాడి చేశారు. దీంతో రైల్వే పోలీసులు గాల్లోకి కాల్పులు జరపాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరుస ఘటనలతో ప్రతి రైలులోను సిబ్బందిని నియమిస్తామని రైల్వే అధికారులు ప్రకటించారే కానీ అవి అమలు కాలేదని తాజా సంఘటనతో అర్థమవుతుంది. మహిళలు ఎక్కువగా ఉన్న బోగీలనే దుండగులు టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు.

- ఉధృతంగా కృష్ణమ్మ భయాందోళనలో ప్రజలు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు
- సాగర్ 26 క్రస్ట్‌గేట్ల నుంచి నీటి విడుదల
- ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక



సాగర్ జలాశయం నుంచి 26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

వీడని వర్షాలు

విజయపురిసౌత్, రెంటచింతల, అచ్చంపేట, అమరావతి, తాడేపల్లి టౌన్, రేపల్లె, కొల్లిపర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిన రైతులు వీడని వర్షాలతో అల్లాడుతున్నారు. మరోవైపు ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద ప్రవాహంతో నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణానదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో కట్టలను తాకుతూ ప్రవహిస్తున్న నీటితో నదీ తీర ప్రాంతప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దీంతో బ్యారేజీ దిగువున గ్రామాలు, లంకల్లోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. నదీ తీరంలో ఎక్కడికక్కడ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ భద్రతా చర్యలు తీసుకున్నారు. బుధవారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో వాగులు పొంగి ప్రవహించడంతో ఎక్కడికక్కడ రాకపోకలు స్తంభించిపోయాయి. వాగుల వెంబడి సాగుభూములు వరద నీటితో చెరువులను తలపిస్తున్నాయి.



అమరావతి మండలం నెమలికల్లు సాగుభూములలో చెరువును తలపిస్తున్న వరదనీరు

నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం కొనసాగుతుంది. శ్రీశైలం నుంచి 2,46,410 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో గురువారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. నీటిమట్టం 586.60 అడుగులు ఉండగా 2,46,410 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సత్రశాలలోని సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు 14 గేట్లను ఎత్తి 1,84,833 క్యూసెక్కుల నీటిని దిగువన వున్న పులిచింతలకు విడుదల చేశారు. సాగర్ నుంచి వస్తున్న నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నారు. వరద నీటి ఉధృతితో ప్రాజెక్టులో విద్యుదుత్పత్తిని కూడా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరదతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది పరవళ్ళు తొక్కుతోంది. ఎగువ నుంచి గురువారం 4,43,184 క్యూసెక్కుల వరదనీరు రిజర్వాయర్‌కు చేరుతోంది. వరద 4 లక్షల క్యూసెక్కులు దాటడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 4 లక్షల 32 వేల 837 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో నదీతీర, లంకల్లోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

కరకట్ట వెంబడి పెట్రోలింగ్

భట్టిప్రోలు మండలం కరకట్ట నుంచి పెసర్లంక వెళ్లే చినరేవు ఓలేరు నుంచి లంకగ్రామాలకు వెళ్లే చిన్నరేవులో వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెనుమూడి పుష్కర్‌ఘాట్‌ను వరద నీరు తాకింది. అధికారులు కరకట్టవెంబడి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. రేపల్లె తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావు వరద ఉధృతిని పరిశీలించి పరిస్థితిని అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేసి గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేశారు. కొల్లిపర తహసీల్దారు సిద్ధార్థ, ఎస్‌ఐ కోటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్ గురువారం బొమ్మువానిపాలెం, కొల్లిపర, అన్నవరం గ్రామాల్లోని రేవులను సందర్శించి వరద ఉధృతిని పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

8

దరఖాస్తు చేయకుంటే మీ సంగతి చూస్తాం

- అసోసియేషన్ నేతలతో ఎక్సైజ్ అధికారుల హెచ్చరికలు
- బార్లకు నేటితో ముగియనున్న గడువు.. వ్యాపారులతో చర్చలు

గంజాయి విక్రయదారుల అరెస్టు

పదోన్నతుల కోసం ఏఎన్ఎంల నిరసన

బీఫార్మసీ విద్యార్థి ఆత్మహత్య

- కళాశాల ఎదుట మృతదేహంతో ఆందోళనకు యత్నం
- అడ్డుకున్న పోలీసులు

6

అత్యాచారం కేసులో నిందితులకు రిమాండ్



చిలకలూరిపేటలో కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, అప్పారావు తదితర టీడీపీ నేతలు

కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, సీనియర్ టీడీపీ నేతలు

చిలకలూరిపేట, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన అనుచరులు అప్పారావు తదితరులపై వైసీపీ ప్రభుత్వ కేసులకు సంబంధించి గురువారం చిలకలూరిపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణకు హాజరయ్యారు. ఈ కేసులను విచారించిన జడ్జి కె నరేంద్ర రెడ్డి సెప్టెంబరు 1 న తీర్పు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. జగన్ ప్రభుత్వ హయాంలో 2023 సెప్టెంబర్‌లో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ చిలకలూరిపేట నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. ఆ సందర్భంలో ప్రత్తిపాటి పిలుపు మేరకు జాతీయ రహదారిపై తిమ్మాపురం వద్ద ధర్నా చేశారని యడ్లపాడు పోలీసు స్టేషన్ లో కేసు నమోదయింది. ఈ కేసులో ప్రత్తిపాటితో పాటు యడ్లపాడు మండలానికి చెందిన మరో 20 మంది సీనియర్ టీడీపీ నాయకులపై కేసు నమోదయింది. వారిలో కుర్రా అప్పారావు, ముద్దన నాగేశ్వరరావు, గోనుగుంట్ల శివ, పోపూరి వెంకయ్య తదితరులు ఉన్నారు. కాగా 2024లో చిలకలూరిపేట అర్బన్ పోలీసు స్టేషన్ లో నమోదైన మరొక కేసుకు సంబంధించి కూడా ప్రత్తిపాటితో పాటు మరో 29 మంది సీనియర్ టీడీపీ నాయకులు కోర్టుకు హాజరయ్యారు. అప్పటి మంత్రి విడదల రజిని మరిది అయిన విడదల గోపీ, అతని అనుచరులు, పలువురు వైసీపీనేతలు కోటప్పకొండ వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలతో ఘర్షణకు పాల్పడిన అనంతరం చిలకలూరిపేట అర్బన్ పోలీసు స్టేషన్ వద్ద జరిగిన ఘటనపై టీడీపీనేతలు, కార్యకర్తలతో పాటు ప్రత్తిపాటిపై కూడా కేసు నమోదయింది. ఈ కేసులో ఉన్న మొత్తం 30 మంది విచారణకు హాజరయ్యారు. వీరిలో సీనియర్ టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, తుబాటి శ్రీహరి, పిల్లి కోటి, బుచ్చిబాబు, మారెళ్ల అప్పారావు, స్టీఫెన్ కరుణాకర్ తదితరులు ఉన్నారు. కోర్టులో ప్రత్తిపాటి, ఆయన అనుచరుల తరపున న్యాయవాదులు ఈపూరి బ్రహ్మానందం, తుబాటి పూర్ణచంద్రరావు, జీవిహెచ్ ప్రసాద్, టీడీపీ లీగల్ టీమ్ విచారణకు హాజరయ్యారు.

మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలి

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు



సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అమరవీరుల పోరాటస్ఫూర్తితో ప్రజలు మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. గురువారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని గాంధీ పార్కు వద్ద బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల నివాళి, సంస్మరణ సభ జరిగింది. ఉద్యమంలో అమరులైన విష్ణువర్దన్ రెడ్డి, రామకృష్ణ, బాలస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో విద్యుత్ చార్జీల వ్యతిరేక ప్రదర్శన సందర్భంగా బషీర్‌బాగ్ వద్ద పోలీసులు జరిపిన కాల్పుల ఘటన జరిగి 25 ఏళ్ళు గడిచిందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.అంజనేయులు నాయక్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట రూ.32 వేల కోట్లు ప్రజలపై భారాలు వేసిందని, విద్యుత్ సంస్థకు చెల్లించాల్సిన రూ.1.25లక్షల కోట్లు చెల్లించకుండా స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలపై భారాలు వేసేందుకు కుట్రలు పన్నిందన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన బీజేపీ తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణలను టీడీపీ, జనసేన ప్రశ్నించడం లేదని, రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టి ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. సంస్మరణ సభకు సీపీఎం నరసరావుపేట మండల కార్యదర్శి డీ శివకుమారి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ మారుతి వరప్రసాదు, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టమైన పోస్టు ఎంపికకు అవకాశం కల్పించాలి

● జిల్లా ఆపస్ అధ్యక్ష, కార్యదర్శులు

వేమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా రెండు పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థులకు ఇష్టమైన పోస్టు ఎంపిక చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం బాపట్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసకుమార్, కుందుర్తి శ్రీనివాసులు కోరారు. గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డీఎస్సీ రాసే సందర్భంలో రెండు పోస్టుల ఎంపికకు అర్హత సాధించిన అభ్యర్థులకు వారికి ఇష్టమైన పోస్టు ఎంపిక కోసం అవకాశం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న డీఎస్సీ-25 నియామకాలలో పలువురు ఉపాధ్యాయులు ఒకటి కన్నా ఎక్కువ పోస్టులకు ఎంపికయ్యారు. ఎస్‌జీటీ స్థానాలు ఎక్కువగా ఉండి స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తక్కువ ఉన్నందున అభ్యర్థులు కాంపిటీషన్ దృష్ట్యా దరఖాస్తులు ఎక్కువ ఖాళీలు ఉన్న ఎస్‌జీటీ స్థానానికి మొదటి అవకాశాన్ని కోరుతూ స్కూల్ అసిస్టెంట్ స్థానాలకు రెండో అవకాశాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ పోస్టులు రెండింటికి అర్హత సాధించారన్నారు. గతంలో ఉపాధ్యాయుల పోస్టు ఎంపికను ముందుగా అడగలేదన్నారు. అభ్యర్థులు పరీక్షలో అర్హత సాధించిన తరువాతే ఆప్షన్స్ స్వీకరించారన్నారు. ఏపీపీఎస్సీ లేదా గ్రూప్స్ ఎగ్జామ్స్ ద్వారా పోస్టులకు ఎంపిక జరుగుతున్నప్పుడు మాత్రమే ఎంపిక క్రమాన్ని స్వీకరించేవారన్నారు. ఈసారి ఉద్యోగులు దరఖాస్తు పెట్టుకునేటప్పుడే ఎస్‌జీటీ, ఎస్ఏల ప్రాధాన్యతా క్రమాన్ని నిర్ణయించడం వల్ల అభ్యర్థులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలని కోరారు.

ఎన్నారై మెడికల్ కళాశాలకు శరీర దానం



గోగినేని రాకుమారి (ఫైల్‌ఫొటో)

వేమూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంపాడు గ్రామానికి చెందిన గోగినేని రాకుమారి(70) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమె పార్థివదేహాన్ని ఎన్నారై మెడికల్ కళాశాలకు భర్త సుబ్బారావు, కుమార్తె లక్ష్మీ దానం చేశారు. ఎన్ఆర్ఐ వైద్య కళాశాల అధికారులు అంబులెన్స్ ద్వారా రాకుమారి పార్థివదేహాన్ని కళాశాలలోని అనాటమీ విభాగానికి తరలించారు. ఆమె నేత్రాలను పెదకాకాని ఐ బ్యాంకుకు దానం చేశారు. నేత్రాలు ఇద్దరికి చూపు కల్పించడానికి ఉపయోగపడతాయని ఐ బ్యాంకు ప్రతినిధులు తెలిపారు. పార్థివదేహం ఒకటి, రెండు సంవత్సరాల పాటు వైద్య పరీక్షల పాఠ్యాంశాల బోధనకు దోహదపడుతుందని ఎన్నారై మెడికల్ అధికారులు తెలిపారు. రాకుమారి మృతి అనంతరం ఆమె భర్త, కుమార్తె తీసుకున్న నిర్ణయానికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పదోన్నతుల కోసం ఏఎన్‌ఎంల నిరసన



గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్‌ఎంలు

గుంటూరు సిటీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన 34 మంది సచివాలయం ఏఎన్‌ఎంలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం వద్ద గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆరు నెలల క్రితం జిల్లాలో గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు గ్రేడ్-2 గా ప్రమోషన్‌లు ఇచ్చారు. అప్పట్లో మొత్తం 300మందితో ప్రమోషన్‌ల జాబితా రూపొందించారు. అయితే ఆ రోజు కేవలం 266మందికి మాత్రమే ప్రమోషన్ ఇచ్చారు. మిగిలిన వారికి పది రోజుల్లో ప్రమోషన్‌లు ఇస్తామని చెప్పి పంపారు. ఆరు నెలలు దాటిన తరవాత ప్రమోషన్‌లు ఇస్తాం రమ్మని చెప్పి జిల్లా అధికారులు 34మంది అర్హులైన ఏఎన్‌ఎంలను గుంటూరులోని కార్యాలయానికి పిలిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాచిన తరవాత ఇప్పుడు ప్రమోషన్‌లు ఇవ్వటం లేదని అధికారులు చెప్పటంతో ఆగ్రహించిన ఏఎన్‌ఎంలు జిల్లా అధికారి కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ జనరల్ పోస్టులకు కొత్తగా ఆర్‌ఓఆర్ తయారుచేయాలని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

165 యూరియా బస్తాలు స్వాధీనం

దాచేపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కారంపూడి నుంచి తెలంగాణలోని కొత్తగూడేనికి తరలిస్తున్న 165 బస్తాల ఎరువులను గురువారం తెల్లవారు జామున దాచేపల్లి మండలం పొందుగుల పోలీసు చెక్‌పోస్టు వద్ద అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం కాంచనపల్లి గ్రామానికి చెందిన సఖిల సురేష్ తదితరులు కారంపూడి నుంచి 165 యూరియా బస్తాలను రెండు వాహనాల్లో తరలిస్తుండగా పొందుగుల పోలీసు చెక్‌పోస్టు వద్ద సాధారణ తనిఖీల్లో పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసిన విజిలెన్స్, పోలీసు, వ్యవసాయశాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

బీఫార్మసీ విద్యార్థి ఆత్మహత్య

● కళాశాల ఎదుట మృతదేహంతో ఆందోళనకు యత్నం

● అడ్డుకున్న పోలీసులు



సూర్య (ఫైల్)

మేడికొండూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం జంగంగుంట్లపాలెం పరిధిలోని ఒక బీఫార్మసీ కాలేజీలో చదువుతున్న విద్యార్థి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థి మృతికి కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ కారణమని ఆరోపిస్తూ గురువారం విద్యార్థి మృతదేహంతో కళాశాల ఎదుట బంధువులు ఆందోళనకు ప్రయత్నించారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం అంబటిపూడికి చెందిన తాళ్లూరి సూర్య జంగంగుంట్లపాలెంలోని బీఫార్మసీ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. సత్తెనపల్లిలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో ఉంటూ కళాశాలకు వచ్చి వెళుతున్నాడు. కళాశాలలో జూనియర్ విద్యార్థినితో సూర్య మాట్లాడుతుండడాన్ని గమనించిన అసిస్టెంట్ ప్రిన్సిపాల్ హెచ్చరించారు. అయినా సూర్య ఆ విద్యార్థినితో మాట్లాడుతుండడాన్ని సీరియస్‌గా తీసుకున్న అసిస్టెంట్ ప్రిన్సిపాల్, సూర్యని గట్టిగా మందలించాడు. తీవ్ర మనస్థాపానికి గురైన సూర్య తానుంటున్న హాస్టల్లో బుధవారం పురుగుమందుతాగి స్పృహతప్పి పడిపోయాడు. ఇతనిని గమనించిన సహచర విద్యార్థులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మరణించాడు. విద్యార్థి మరణానికి కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ కారణమని ఆరోపిస్తూ విద్యార్థి బంధువులు గురువారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిని నుండి మృతదేహాన్ని గ్రామానికి తరలిస్తూ మార్గమధ్యంలో కళాశాల వద్ద మృతదేహాన్ని ఉంచి ధర్నాకు ప్రయత్నించారు. సమాచారాన్ని ముందుగానే తెలుసుకున్న పోలీసులు కళాశాల వద్దకు చేరుకొని ధర్నా ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వటంతో మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించారు.

దివ్యాంగులు అర్హతను బట్టి అప్పీలు చేసుకోవాలి

● డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఝూన్సీ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న దివ్యాంగులు అర్హతను బట్టి మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోల వద్ద అప్పీలు చేసుకోవాలని పల్నాడు జిల్లా డీఆర్‌డీఏ డైరెక్టర్ ఝూన్సీ గురువారం తెలిపారు. జిల్లాలో వికలాంగుల పెన్షన్లకు సంబంధించి రీ అసెస్మెంట్ చేసి 2727 మందికి నోటీసులు ఇచ్చామన్నారు. వీరిలో 1807మంది మాత్రమే మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోల వద్ద అప్పీలు చేసుకున్నారని చెప్పారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పొన్నూరు టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం నిడుబ్రోలు రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురించి స్థానికులు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న బాపట్ల రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి శవ పరీక్షల నిమిత్తం తరలించారు. అయితే గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ మృతి చెందాడ లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయంపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...

దాచేపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనం పైనుంచి జారి కిందపడటంతో ఓ యువకుడు మృతిచెందగా మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో జరిగింది. మృతుడు గురజాల మండలం మాడుగుల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడి పేరు వేణు(21) వినాయక విగ్రహం కొనుగోలు చేసేందుకు వస్తూ మార్గ మధ్యంలో నడికూడి గ్రామం వద్ద బండి పైనుంచి కింద పడిపోయారు. వేణు తలకు బలమైన గాయాలై మృతిచెందాడు. బండి వెనుక కూర్చున్న మరో ఇద్దరు యువకులు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డుకు గౌరీనాథం ఎంపిక



జీ గౌరీనాథం

మాచవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 5వ తేదీ ఇవ్వనున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డుకు గొల్లపల్లి గౌరీనాథం ఎంపికైనట్లు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పీ నాగయ్య, గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌సీ కేఎస్ లక్ష్మణరావు గురువారం తెలిపారు. గౌరీనాథం ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా అనేక విద్యాసంస్థల్లో పనిచేసి అనేకమంది విద్యార్థులను తీర్చిదిద్దటంలో చేసిన కృషికి ఫలితంగా ఈ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 31న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అవార్డు అందజేస్తారని తెలిపారు. గౌరీనాథం స్వస్థలం మాచవరం మండలం గంగిరెడ్డిపాలెం గ్రామం. ఈయన ప్రస్తుతం తమిళనాడులోని ఎస్ఆర్‌వీ ఇంటర్నేషనల్ స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

జాతీయ ప్రతిభా పురస్కారానికి నరసింహారావు..



చింతల నరసింహారావు

● పిడుగురాళ్ల: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారానికి స్థానిక ఎస్టీ జోసఫ్ బాలికల హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు చింతల నరసింహారావు ఎంపికైనట్లు హెచ్ఎం సిస్టర్ రాణి తెలిపారు. ఈ సందర్భంగా నరసింహారావుకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

అత్యాచారం కేసులో నిందితులకు రిమాండ్

నరసరావుపేట లీగల్, రొంపిచర్ల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఓ వివాహితను అత్యాచారం చేసిన కేసులో నిందితులైన రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామానికి చెందిన గుడిపాటి పుల్లారావు, ఉయ్యాల శివయ్యలకు రిమాండ్ విధిస్తూ స్థానిక రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయ అధికారి ఏ సలోమి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 25వ తేదీన నిందితులు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు రొంపిచర్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, గ్యాంగ్ రేప్ చట్టాల కింద కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను గురువారం అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పరచగా రిమాండ్ విధించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు

తెనాలి క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రంలో గంజాయి తక్కువ ధరలలో కొనుగోలు చేసి తెనాలిలో వాటిని అమ్ముతున్న ఐదుగురు సభ్యుల ముఠాను తెనాలి త్రీ టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... తెనాలి బాలాజీరావుపేట మహేంద్ర కాలనీకి చెం దిన పాలడుగు బాలకృష్ణ (42) పట్టణంలోని గంగానమ్మపేట, మసీదు ప్రాంతానికి చెందిన సయ్యద్ మొహజాహిద్ (26) ఇద్దరూ కలసి ఒరిస్సా రాష్ట్రంలోని పెదపాకాలలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి తె నాలిలో అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు. వారితో పాటు మరో ముగ్గురు ముఠాసభ్యులు అమృతలూరు మం డలం కూచిపూడికి చెందిన పోతార్లంక కార్తీక్ (20), బాలారావుపేటకు చెందిన యలవర్తి శివకుమార్ (30), చెంచుపేట అనిబీసెంట్ స్కూల్ ప్రాం త వాసి షేక్ సమీర్ హుస్సేన్ (27)లు కల సి బాలాజీరావుపేటలో మస్తానమ్మతోటకు చెందిన ఖాళీప్రదేశం పొదల మధ్య గంజా యి అమ్మకాలు చేస్తున్నారు. అంతేకాకుండా గంజాయి సేవిస్తున్న ఈ ముఠా కూడా అక్క డే దాగి ఉందన్న సమాచారంతో ఆకస్మికం గా దాడిచేసి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద 1.150 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్‌డీపీఎస్-1985 యాక్టు ప్రకారం అరెస్టుచేసి కోర్టులో ప్రవేశ పెట్టినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో పి.మురళి, డి.సురేష్, ఎస్ఐ జైకర్, అబ్దుల్ సలాంను డీఎస్పీ జనార్దనరావు అభినందించారు.



గంజాయి ముఠాను అరెస్టు చూపుతున్న తెనాలి త్రీ టౌన్ పోలీసులు

46,264 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 45,242 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 46,264 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,315 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	14300
నంబరు. 5	10000	13500
273	--	--
341	10000	15200
4884	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	--	--
షార్క్-1	10000	15200
బ్యాడిగి 355	--	--
సింజెంటా బ్యాడిగి 5531	10000	14600
దేవనూరు డీలక్స్	--	--

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	10000	13800
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14000
నంబరు. 5	10000	13600
341	11000	15500
4884	10000	13000
ఏసీ స్పెషల్ వెరైటీ		
షార్క్-1	10000	15400
బ్యాడిగి 355	--	--
సింజెంటా బ్యాడిగి 5531	10000	14000
దేవనూరు డీలక్స్	--	--
తాలుకాయలు	5000	7500

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కొత్తమాసు భాస్కర్ (ఫైల్)

చిలకలూరిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నరసరావుపేట రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. మృతి చెందిన వ్యక్తిని పట్టణంలోని మమ్మీ డాడీ డ్రెస్సెస్ షాపు యజమాని కొత్తమాసు భాస్కర్(49)గా గుర్తించారు. నరసరావుపేటలోని ఒక ఇంజనీరింగ్ కళాశాల నుంచి విద్యార్థుల యూనిఫాం విషయం మాట్లాడేందుకు చిలకలూరిపేట నుంచి బైక్‌పై నరసరావుపేట వెళుతుండగా లింగంగుంట్ల కావూరు గ్రామాల మధ్య ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఒకే వైపు వెళ్తున్న రెండు బైకులు అదుపు తప్పి ఢీకొన్నాయి. ఒక బైకుపై ఉన్న కొత్తమాసు భాస్కర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరొక బైక్ పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆ బైకుపై ఉన్న నాదెండ్ల మండలం చిరుమామిళ్లకి చెందిన రైతు కంచేటి వీరాంజనేయులు (63) గాయపడ్డాడు. రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

స్త్రీశక్తి భారీ బహిరంగ సభను విజయవంతం చేయండి

కారంపూడి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేసి మహిళలకు ఆర్థికంగా భరోసాను చేకూర్చిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపేందుకు శుక్రవారం కారంపూడిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్‌యాదవ్ గురువారం కోరారు.



రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావును సత్కరిస్తున్న కోనేరు నరసింహారావు, బాడిశ మస్తాన్ రావు, విద్యార్థులు

విద్యార్థులు ఉన్నత చదువులే లక్ష్యంగా ఉండాలి

● రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల

పిడుగురాళ్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉన్నత చదువులే లక్ష్యంగా చేసుకొని చదువుకున్నప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వరరావును గురువారం కొండమోడు సమీపంలోని కేఎన్ఆర్, పీఎస్ఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్లు కోనేరు నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావు, విద్యార్థులు సత్కరించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న మార్పులతో ప్రతి విద్యార్థి చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. తల్లికి వందనం వల్ల ఎంతోమంది విద్యార్థులు లబ్ధిపొందారని, చదువుకున్న ప్రతి విద్యార్థికి ప్రతిభ ఆధారంగా కూటమి ప్రభుత్వం వివిధ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు గోనుగుంట్ల తెలిపారు. కార్యక్రమంలో మందలపు వెంకటరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను ప్రోత్సహించొద్దు

● సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు

రెంటచింతల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను బాగా చదివించాలని బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని గురజాల సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు కోరారు. గురువారం రెంటచింతలలోని రేగులమాన్యంలో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.ప్రియదర్శిని నేతృత్వంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై నిర్వహించిన కార్యక్రమానికి జడ్జి వై.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డాక్టర్ ఎస్.కృష్ణారెడ్డి మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల వచ్చే ఆరోగ్యపరమైన అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాది కె.ప్రభుదాస్, జానీ భాష, మణిదీప్, అనిల్‌కుమార్, కనకరాజు, ఎంఈవో 2 శివనాగేశ్వరరావు, సీడీపీవో తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు

లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించిన అసిస్టెంట్ కమిషనర్

బెల్లంకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కేతవరం లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ అర్జున్ శ్రీనివాసరావు గురువారం సందర్శించారు. ముందుగా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోకి వెళ్లి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేతవరం లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రెండు సంవత్సరాల్లో నూతన ఆలయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని యమ్మాజీగూడెం నుంచి కేతవరం లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్దకు త్వరలోనే రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కోటప్పకొండ దేవదాయ శాఖ అధికారి చంద్రశేఖర్, అమరావతి అధికారి కుమారి రేఖ, సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ లీలావతి, బెల్లంకొండ అధికారి ఎస్ కోటిరెడ్డి, సిబ్బంది జాలయ్య, పూజారులు తదితరలు పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించిన దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ అర్జున్ శ్రీనివాసరావు

మద్యం మత్తులో డ్రెయినేజ్‌లో పడి వ్యక్తి మృతి

రెంటచింతల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో డ్రెయినేజ్‌లో పడి ఓ బేల్దార్ మేస్త్రి మృతి చెందిన ఘటన రెంటచింతలలోని శ్రీచౌడేశ్వరీ అమ్మవారి ఆలయం సమీపంలో బుధవారం జరిగింది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెంటచింతలకు చెందిన బేల్దార్ మేస్త్రి చట్లా సాగర్‌రాజు(40) వినాయక చవితి పండుగ సందర్భంగా మద్యం తాగి వస్తూ డ్రెయినేజ్‌లో పడిపోయాడు. బయటకెళ్లిన వ్యక్తి ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వెతుకులాట ప్రారంభించగా ఇంటికి సమీపంలోని ఆలయం వద్ద పడిపోయి మృతి చెందినట్లు గుర్తించారు. భార్య రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాలకు తరలించారు.



సాగర్‌రాజు మృతదేహం

తాళం వేసిన ఇంట్లో చోరీ

రాజుపాలెం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమోడు శివారు వీరమ్మకాలనీలోని ఓ ఇంట్లో ఈ నెల 26 రాత్రి దొంగతనం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వీరమ్మ కాలనీకి చెందిన గుత్తా రాంబాబు తన భార్య వెంకటలక్ష్మితో కలిసి సత్తెనపల్లి మండలం అబ్బూరు తన బంధువుల వివాహానికి వెళ్లారు. రాత్రికి అక్కడే ఉన్నారు. ఇద్దరు కుమారులు రాంబాబు అమ్మ రెండో అంతస్తులో నిద్రపోయారు. నిద్రలేచి చూసేసరికే తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఈ సంఘటనలో 4 సవర్ల బంగారం, రూ.20 వేలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చల్లగుండ్ల పొలాలను ముంపు నుంచి కాపాడాలి

నకరికల్లు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చల్లగుండ్ల గ్రామాలకు చెందిన వరి పొలాలు ముంపునకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, సీపీఎం నాయకులు తహసీల్దార్ కే పుల్లారావును కోరారు. గురువారం ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. చీమలమర్రికి చెందిన శ్రీను, శ్రీహరి అనే వారు చేపల నిర్వహిస్తూ పెద్ద ఎత్తున కట్టలు నిర్మించటం వల్ల చల్లగుండ్ల గ్రామానికి చెందిన వరి నారు మడులు నీట మునిగాయని తెలిపారు. కార్యక్రమంలో గాడిదమళ్ళ పిచ్చారావు, ఈపూరి లక్ష్మారెడ్డి, షేక్ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడి కృపతో వరికపూడిశెల పూర్తి

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విఘ్నేశ్వరుడి కృపతో నిర్విఘ్నంగా వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణ పనులు జరగాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నిర్వహించిన వినాయకచవితి ఉత్సవాల్లో బ్రహ్మానందరెడ్డి, శోభారాణి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్త్రీశక్తి విజయోత్సవ సభను జయప్రదం చేయండి

స్త్రీశక్తి పథకాన్ని దిగ్విజయంగా అమలుచేసిన సందర్భంగా కారంపూడిలో మహిళలతో శుక్రవారం నిర్వహించనున్న విజయోత్సవ సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు కారంపూడిలోని ఆర్అండ్‌బీ బంగ్లా ఎదురుగా నిర్వహించే ఈ సభకు నియోజకవర్గంలోని మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, శోభారాణి దంపతులు

ఆచార్య నాగార్జునుడి బోధనలు ఆచరణీయం

● చికాగో బౌద్ధాలయంలో శివనాగిరెడ్డి

విజయపురిసౌత్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జునుడి బోధనలు ఆచరణీయమని ప్రముఖ బౌద్ధ పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి అన్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఇల్లినాయిస్ రాష్ట్రం చికాగోలో 1944లో, రెండో ప్రపంచ యుద్ధ శిబిరాల్లో బంధితులైన జపాన్-అమెరికన్ల పునరావాసం సందర్భంగా నిర్మించిన మిడ్ వెస్ట్ అమితాభ బౌద్ధాలయాన్ని గురువారం ఆయన సందర్శించి ప్రసంగించారు. దేశంలో అతి పెద్దదైన బుద్ధవనాన్ని దేశంలో నుంచే కాక దక్షిణాసియా, పశ్చిమ దేశాల బౌద్ధ పర్యాటకులు సందర్శిస్తున్నారని తన ప్రసంగంలో చెప్పారు. అనంతరం చికాగో-మిడ్ వెస్ట్ బుద్ధిస్ట్ టెంపుల్ ప్రధానాచార్యులు గ్యాదోకినో ప్రచురణలను శివనాగిరెడ్డికి బహూకరించారు. కార్యక్రమంలో చికాగో సాహితీ మిత్రులు సంస్థ కార్యదర్శి జయదేవ్ మెట్టుపల్లి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న శివనాగిరెడ్డి

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

గురజాలటౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తుందని మున్సిపల్ కమిషనర్ శివన్నారాయణ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అనధికార లేఅవుట్ల రెగ్యులైజేషన్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. కమిషనర్ శివన్నారాయణ మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో ఏడు అనధికార లేఅవుట్లను గుర్తించామన్నారు. జూన్ 30వ తేదీలోగా వేసిన అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. స్కీమ్‌లో భాగంగా 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జెస్‌లో 7శాతం తీసుకుంటుందన్నారు. వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ ఇన్‌చార్జి చైర్మన్ బడేజాని, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం

దుర్గి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులేశునిపల్లెలో గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. సెప్టెంబర్ 9వ తేదీన హైదరాబాద్‌లో జరిగే దివ్యాంగుల మహాగర్జన సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎండూరి నాగరాజు, కందుకూరి రమేష్, విజయ్‌కుమార్, మారెపోగు రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

● అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు

అచ్చంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన అరిగల అఖిల(26) గురువారం ఉరి వేసుకొని మృతి చెందింది. అరిగల వనేష్‌తో ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి పిల్లలు కలగలేదు. తాళ్లచెరువు గ్రామానికి చెందిన జక్కులూరి బాలస్వామి కుమార్తె అఖిల కుటుంబ కలహాల నేపథ్యంలో మృతి చెందింది. ఆమె బంధువు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. శవ పంచనామా అనంతరం పోస్టుమార్టం నిర్వహించేందుకు మృతదేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమె మృతికి తాళ్లచెరువు, చింతపల్లి గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.



అఖిల మృతదేహం

రైతులు నానో యూరియా వాడకంపై శ్రద్ధ చూపాలి

క్రోసూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియా వాడకంపై శ్రద్ధ చూపాలని మండల వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్ అన్నారు. గురువారం క్రోసూరు, బయ్యవరం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. సాధారణ యూరియాతో పాటుగా రైతులు నానో యూరియాను ఉపయోగిస్తే అధిక ప్రయోజనం ఉంటుందన్నారు. సాధారణ యూరియా కన్నా నానో యూరియా తక్కువ ధరకు లభిస్తుందన్నారు. రైతులకు ఖర్చు కూడా తగ్గుతుందని, ఎనిమిది శాతం ఎక్కువ దిగుబడి లభించే అవకాశం ఉందన్నారు. దీనివల్ల పెట్టుబడి ఖర్చు తగ్గటంతో పాటు కాలుష్యం కూడా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది స్వర్ణలత, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పత్తిలో తెల్ల దోమల నివారణకు చర్యలు

పెదకూరపాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పత్తి పొలంలో తెల్లదోమ నివారణకు వేపగింజల కషాయాన్ని లీటరు నీటిలో ఐదు మిల్లీ లీటర్ల చొప్పున వేప నూనె పిచికారి చేసుకొనివాడాలని మండల వ్యవసాయ అధికారి డీ.కృష్ణయ్య అన్నారు. లగడపాడు, కన్నెగండ్లలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణయ్య రైతులకు పలు సూచనలు చేశారు.

ముక్త్యాల రాజాకు ఘన నివాళి

విజయపురిసౌత్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగుల ఆధ్వర్యాన విజయపురిసౌత్‌లో గురువారం శ్రీరాజా వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వరప్రసాద్ (ముక్త్యాలరాజా) 53వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్త్యాల రాజా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేసీపీ సీనియర్ జనరల్ మేనేజర్ వెంకటరమణ, కేసీపీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కన్నాపై అసత్య ప్రచారం తగదు

సత్తెనపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణపై అంబటి రాంబాబు విమర్శలు చేస్తే సహించేది లేదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధులు పూజల వెంకట కోటయ్య, కంబాల వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంబటి మంత్రిగా ఉన్నప్పుడు స్కాములు తప్పితే చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. నెలకు ఒకసారి సత్తెనపల్లి వచ్చి ఉనికిని చాటు కోవటం కోసం ఎమ్మెల్యే కన్నాపై అసత్య ప్రసారాలు చేస్తే తాట తీస్తామని హెచ్చరించారు.

స్టాక్‌లో తేడాలు వస్తే డీలర్ల లైసెన్స్‌లు రద్దు

నకరికల్లు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో స్టాక్‌లో తేడాలు వస్తే డీలర్ షిప్ లైసెన్స్‌లను రద్దు చేస్తామని తహసీల్దార్ కే పుల్లారావు, ఎస్ఐ సీహెచ్ సురేష్, ఏవో కే.దేవదాసు హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న భౌతిక నిల్వలను ఎరువులను పరిశీలించారు. డీటీ తుమ్మా కొండారెడ్డి, దుకాణదారులు పాల్గొన్నారు.

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వెంకట సుబ్బమ్మ మృతి

రెంటచింతల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పల్నాట ప్రముఖ ఆధ్యాత్మికవేత్తగా పేరుగాంచిన యేచూరి వెంకట సుబ్బమ్మ(85) బుధవారం మృతి చెందారు. ఆమె కొంత కాలం నుంచి అస్వస్థులుగా ఉన్నారు. రామకోటిని రాయడం 2004 జూన్‌లో మొదలుపెట్టి 2014 జూలై 13న ఒక కోటి 8 లక్షల సార్లు రాసి వార్తల్లోకెక్కిన సుబ్బమ్మను గీత ప్రచార మండలి చైర్మన్ పందిరి శ్రీశైలం రెంటచింతలలో ఘనంగా సన్మానించారు. వివిధ వర్గాలకు చెందిన వారు సుబ్బమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారిలో శ్రీవాసవీ ఆలయ చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, గుండా రామ్మూర్తి, యేచూరి కమలాకరరావు, ఆగ్రోస్ శ్రీనివాసరావు, రాంబాబు, బుడ్డ శివాలయం చైర్మన్ కొత్త గోపాలరావు, వైపీ సైదయ్య తదితరులున్నారు.



వెంకట సుబ్బమ్మ (ఫైల్)

భక్తి శ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పర్వదినాన్ని బుధవారం మండలపరిధిలోని గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించి గురువారం నిమజ్జన కార్యక్రమానికి తరలిస్తున్నారు. పవిత్ర కృష్ణానదిలో గణనాథుల విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేస్తున్నారు. పోలీసు, రెవెన్యూ సిబ్బంది నిమజ్జన కార్యక్రమం వద్ద పర్యవేక్షణ చేస్తున్నారు.

● అచ్చంపేటలోని ఎన్‌టీఆర్ విగ్రహ సెంటర్లో కాకతీయ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 84 గణేషుని విగ్రహాలను భక్తులు ఏర్పాటు చేసినట్టు సీఐ పీ.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. నది వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామని, ఫెన్సింగ్‌తో పాటు క్రేన్ కూడా అందుబాటులో ఉన్నట్టు సీఐ తెలిపారు.

● బెల్లంకొండ మండలంలోని పలు గ్రామాల్లో చవితి వేడుకలను వైభవంగా నిర్వహించారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ నాగిరెడ్డిపాలెంలోని వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచాయపాలెం ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో, వెంకటాయపాలెంలో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

● క్రోసూరు మండలంలోని వివిధ గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతవరం కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సంపూర్ణ మట్టి గణపతి విగ్రహం విశేషంగా భక్తులను ఆకర్షించింది.

● పెదకూరపాడులోని జన చైతన్య సమితి ఆధ్వర్యంలో జవ్వాది సతీష్ సహకారంతో 350 మట్టి వినాయక ప్రతిమలను వినాయక చవితి పండుగ సందర్భంగా పంపిణీ చేశారు. మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద వినాయక విగ్రహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

● మాచర్ల రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకొని రోటరీక్లబ్ ఆధ్వర్యాన 500 ప్రతిమలను అందించారు.

● కారంపూడి మండల పరిధిలో ఆర్యవైశ్య యువజన సంఘం, కాపు సంఘం ఆధ్వర్యంలో చవితి వేడుకలను ఘనంగా జరిపారు.

● విజయపురిసౌత్‌లో భజరంగదళ్ యూత్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి అర్చకుడు ప్రశాంత్‌శర్మ పూజలు నిర్వహించారు. తాళ్లపల్లి కుడి కాలువ బ్రిడ్జి వద్ద విగ్రహాలను నిమజ్జనం చేశారు.

● గురజాల మండలపరిధిలో చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ, గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేసి వినాయకుడి విగ్రహాలను కొలువుదీర్చారు.

● రెంటచింతల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలతో పాటు మిగతా 10 గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మల్లవరంలో నిర్వహించిన గణపతి పూజలో ఎమ్మెల్యే తనయుడు గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు. విగ్రహాలను సత్రశాల కృష్ణానది, కంభంపాడు బ్రిడ్జి వద్ద కాలువలో నిమజ్జనం చేశారు.

● దుర్గి మండలంలో చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చొని గణనాథునికి ప్రత్యేక పూజలు జరిపారు.



సత్తెనపల్లి పట్టణంలో వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

● సత్తెనపల్లి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నాగన్నకుంటలో 1600 కొబ్బరికాయలతో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం భక్తులను ఆకట్టుకుంది.



చేజర్ల కపోతేశ్వరాలయంలో గణపతి

● నకరికల్లు మండలం చేజర్ల కపోతేశ్వరాలయంలో ఉన్న తెలుగు వారి తొలి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● పిడుగురాళ్ల, ఆగస్టు 28 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, శివాలయం వద్ద తారకరామ యూత్ ఆధ్వర్యంలో, ఆంధ్రా బ్యాంక్ సెంటర్లో గణేస్ మిత్రమండలి ఆధ్వర్యంలో, సినిమాహాళ్ల సెంటర్‌లో రెడ్డి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయకచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం సుమారు వెయ్యి మందికి వికాస్ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

● మాచవరం మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. మాచవరంలో ఆర్యవైశ్య యూత్ మహిళా విభాగం వారు రూ 56,116లకు లడ్డు వేలం పాటను దక్కించుకున్నారు. వేమవరం తిరుపతమ్మ దేవాలయం వద్ద 41 కేజీల లడ్డును బొడ్డుపల్లి అనంతరామయ్య మనువళ్ళు అందజేశారు.

● దాచేపల్లి బొడ్రాయి సెంటర్లో రెండు వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. బంగ్లా సెంటర్లో ఆర్యవైశ్య సోదరులు, కారంపూడి రోడ్డులో ఎలక్ట్రానిక్ మీడియా వారు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

కూటమి పాలనలో పింఛన్ అనేది ప్రజల హక్కు

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో పింఛను అనేది ప్రజల హక్కు అని, పేదలకు భరోసా అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. గుంటూరులోని నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్క అర్హుడి పింఛన్‌ను కూడా నిలిపి వేసిన దాఖలాలు లేవన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక దివ్యాంగ పింఛన్లపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో అనర్హులకు, వారి పార్టీ కార్యకర్తలకు పింఛన్లు కేటాయించారన్నారు. అనర్హులను గుర్తించేందుకే ప్రభుత్వం సదరమ్ సర్టిఫికెట్లను సహజంగానే పరిశీలించిందని, ఈ ప్రక్రియను వక్రీకరించి పింఛన్లు తీసి వేశారని వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. పింఛన్లపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఇప్పటికైనా ఆపకుంటే రానున్న రోజుల్లో రాష్ట్రంలో వైసీపీ కనుమరుగు అవుతుందని హెచ్చరించారు.

ప్రజలకు యాజమాన్య హక్కులు కల్పించడమే స్వమిత్ర ఉద్దేశం

● జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరరావు నాయక్

క్రోసూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోను, రాష్ట్రంలోను కూటమి అమలు చేస్తున్న స్వమిత్ర కార్యక్రమ ముఖ్యఉద్దేశం ప్రజల భూములకు, గృహాలకు స్పష్టమైన, న్యాయ పరమైన సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించటమేనని జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరరావు నాయక్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో స్వమిత్ర కార్యక్రమం బృందాలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు కూడా పలు సూచనలు చేశారు. మండలంలో దొడ్లేరు, ఆవులవారిపాలెం, పెరికపాడు, అనంతవరం, అందుకూరు, బాలెమర్రు, గరిక పాడు, గుడిపాడు, గాదెవారిపాలెం, నాగవరం గ్రామాలను స్వమిత్ర కార్యక్రమం అమలుకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఐదుగురు సభ్యులతో కూడిన బృందాలు ఆయా గ్రామాల్లోని ఇంటింటికి తిరిగి ప్రతి ఇల్లు కొలతలు వేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. ప్రజలందరూ కొలతలకు సహకరించాలని, తమ స్థలాల హద్దులు చూపించాలని తెలిపారు. గ్రామాల్లో పర్యటించే బృందంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, సర్వే అసిస్టెంట్ ఉంటారన్నారు. శిక్షణలో ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్వమిత్ర బృందాల శిక్షణలో మాట్లాడుతున్న డీపీవో నాగేశ్వరరావునాయక్

గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి

గామాల్లో పంచాయతీ సిబ్బంది, ఆయా గ్రామాల అధికారులు పారిశుధ్య కార్యక్రమాలను మెరుగుపరిచి దోమల వ్యాప్తిని నివారించటంతో పాటు అంటు వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలని నాగేశ్వరరావునాయక్ అన్నారు. గురువారం మండలంలోని దొడ్లేరులో ఆయన పర్యటించారు. పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఎంపీడీవో రవికుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకయ్య, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సీపీఎం కార్యకర్తల నిరసన

సత్తెనపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని బషీరాబాగ్‌లో 2000 ఆగస్టు 28న జరిగిన విద్యుత్ పోరాటంలో అమరులైన వారికి సీపీఎం ఆధ్వర్యంలో గురువారం తాలూకా సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసే ప్రక్రియను నిలిపి వేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గద్దె చలమయ్య, గుంటూరు విజయ కుమార్, ధరణికోట విమల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమెరపూడిలో గల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు గురువారం సబ్‌స్టేషన్ ఎదురు నిరసన వ్యక్తం చేశారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విధుల నుంచి తొలగించారని పేర్కొంటూ సబ్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ ఉద్యోగం చేస్తున్నామని, తమ తప్పు లేమి లేకపోయినా తమను ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డిలు వీరి నిరసనకు మద్దతు తెలిపారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి వారితో మాట్లాడి ఆందోళన కార్యక్రమాన్ని విరమింప చేశారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోండి

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : అల్ప పీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఎలవర్తిపాటి షేక్ జైభూన్‌బీ అన్నారు. మండలపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో గురువారం జరిగింది. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలు కూడా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంపీ డీవో బండి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపడుతున్నామన్నారు. వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



నెమలికల్లు మండెపూడి రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు

భారీ వర్షాలతో పొంగి ప్రవహిస్తున్న వాగులు

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బుధవారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి మండల పరిధిలోని వాగుల్లో వరదనీరు పొంగి ప్రవహిస్తుంది. వాగుల వెంట సాగు భూములు వరదనీటితో చెరువులను తలపిస్తున్నాయి. ప్రధానంగా నరుకుళ్లపాడు, ఎండ్రాయి వాగుల్లో ప్రవాహం పెదమద్దూరు వద్ద కలసి కృష్ణానదిలో కలుస్తుంది. దీంతో పెదమద్దూరు వద్ద వాగు చప్టాపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండటంతో అమరావతి-విజయవాడ వైపు నడిచే వాహనాల రాక పోకలు నిలిచిపోయాయి. నెమలికల్లు-మండెపూడి గ్రామాల మధ్య రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుంది. అమరావతిలో కృష్ణానది కూడా రెండు రోజులు నీటి మట్టం తగ్గి మరలా పెరుగుతుంది.

మల్లాలమ్మ వార్షిక వేడుకలు




మల్లాలమ్మ తల్లి

దుర్గి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులేశునిపల్లె శివారులో ఉన్న మల్లాలమ్మ ఆలయ రెండో వార్షిక వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

గణేష్ మహరాజ్‌కీ జై




తెనాలి: రజకపేటలో ఆంజనేయ గణపతి




గుంటూరు: కాకుమానువారితోటలో ఏర్పాటు చేసిన గణనాథుడు



కర్లపాలెం: పోలిరెడ్డిపాలెంలో కొలువుదీరిన వినాయకుడు




గుంటూరు: ఏలూరు బజారులో పుష్పాల అలంకరణలో కొలువు దీరిన గణనాథుడు



పొన్నూరు: కాళింగ మర్దన కృష్ణ అలంకారంలో కొలువైన గణనాథుడు

విద్యుత్ కాంతులు, సంప్రదాయాలు ఉట్టిపడేలా, సినీ సెట్టింగ్‌లను మరిపించేలా ఏర్పాటు చేసిన మండపాల్లో వినూత్న రూపాల్లో గణనాథులు భక్తులకు దర్శనమిచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకుని గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలతో పాటు వివిధ పట్టణాలు, పల్లెల్లో భారీ గణపతులు కొలువుతీరగా భక్తులు దర్శనాలకు పోటెత్తారు. గణపతి బప్పామోరియా, జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అన్న నినాదాలతో మండపాలు మారుమోగాయి.



తుళ్లూరులో ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన గణనాథుడు




తాడేపల్లి: ఉండవల్లిలో కొలువైన ఎకో ఫ్రెండ్లీ (మట్టి) గణపతి



నరసరావుపేట: కోటప్పకొండ రోడ్డులో ఏర్పాటుచేసిన మట్టి విగ్రహం



పాతమంగళగిరి జీఆర్ స్కూల్ వద్ద కొలువైన గణనాథుడు



తాడికొండ: నిడుముక్కలలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం



గుంటూరు నల్లచెరువు, 6వ లైన్లో కొలువుదీరిన గణనాథుడు

మురుగు ఉండదు.. నీరు కనిపించదు

- నాలుగు గ్రామాల్లో మేజిక్ డ్రెయిన్‌లు
- మురుగునీరు భూమిలో ఇంకిపోయే వ్యవస్థ
- కొలకలూరు బీసీ కాలనీలో పైలట్ ప్రాజెక్టు
- చింతలపూడి, మంగళగిరిపాడు, తిక్కిరెడ్డిపాలెం ప్రతిపాదనల నివేదన

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డ్రెయిన్ల నిర్మాణం, నిర్వహణ పంచాయతీలకు భారంగా మారుతుండటంతో ఉపాధి హామీ పథకం కింద మేజిక్ డ్రెయిన్లను నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది. తక్కువ ఖర్చు, జీరో మెయిన్‌టెనెన్స్, నీరు ఎక్కడికక్కడ ఇంకిపోయే ప్రయోజనాలు ఉండటంతో తొలుత నాలుగు గ్రామాల్లో అక్టోబరు 2వ తేదీ నాటికి నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటికే తెనాలి మండలంలోని కొలకలూరు బీసీ కాలనీలో పైలట్ ప్రాజెక్టుగా 160 మీటర్ల మేజిక్ డ్రెయిన్‌ని నిర్మించారు. దుగ్గిరాల మండలంలోని చింతలపూడి, మేడికొండూరులోని మంగళగిరిపాడు, ప్రత్తిపాడులోని తిక్కిరెడ్డిపాలెంలోనూ మేజిక్ డ్రెయిన్లను ప్రతిపాదనలను పంపించారు. వీటి పనులు కూడా త్వరలోనే ప్రారంభమౌతాయని అధికారవర్గాలు తెలిపాయి.

మేజిక్ డ్రెయిన్‌లు అంటే...

మేజిక్ డ్రెయిన్లను ఇరుకుగా ఉండే రోడ్లలో నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తారు. అర మీటర్ వెడల్పు, రెండు మీటర్ల లోతు ఉపాధి హామీ లేబర్ కాంపొనెంట్ కింద మట్టి పని చేయిస్తారు. ఆ తర్వాత 75 ఎంఎం ఓటీజీ రాయితో లేయర్ వేస్తారు. రెండో లేయర్ 40 ఎంఎం మెటల్, మూడో లేయర్ 20 ఎంఎం మెటల్‌లతో లేయర్ నిర్మిస్తారు. ప్రతీ 30 మీటర్లకు ఒక ఇంకుడు గుంట కూడా ఈ మేజిక్ డ్రెయిన్‌లోనే నిర్మాణం చేస్తారు. అందులోకి వచ్చిన నీరు భూమిలోకి ఇంకిపోయేలా నాలుగు లేయర్ల రాక్, మెటల్‌తో నిర్మిస్తారు. ప్రతీ వీధి చివరన ఒక పెద్దగుంతని కూడా తవ్వుతారు. వీటి వలన ఇళ్లల్లో ఉత్పత్తి అయ్యే నీటితో పాటు వర్షం కురిసిన సమయంలో వచ్చే వరదనీరు కూడా తేలికగా భూమిలోకి ఇంకిపోయి భూగర్భ జల మట్టాన్ని పెంచుతుంది.

నిర్వహణ... పారిశుధ్యం సులభతరం

మేజిక్ డ్రెయిన్ నిర్వహణ పెద్దగా ఉండదు. దీని వలన పారిశుధ్యం గణనీయంగా మెరుగుపడుతుంది. ఏడాదికి ఒకటి/రెండుసార్లు మాత్రం మేజిక్ డ్రెయిన్‌లో ఏర్పడే మట్టి, చెత్త, చెదారాలను తొలగిస్తే సరిపోతుంది. ఈ డ్రెయిన్ల వలన ఇళ్ల మధ్యన మురికికూపాలు ఏర్పడే అవకాశం ఉండదు. దాంతో ప్రజలు అంటువ్యాధుల బారినపడే ప్రమాదం అసలే ఉండదని అధికారవర్గాలు తెలిపాయి. మహాత్మా గాంధీ జయంతి నాటికి జిల్లాకు కేటాయించిన నాలుగు గ్రామాల్లో మేజిక్ డ్రెయిన్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకొన్నారు.



మేజిక్ డ్రెయిన్

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

- తొలి రోజు 932 మందికి పూర్తి
- 28 కమిటీలతో ప్రత్యేక ఏర్పాట్లు

గుంటూరు (విద్య) ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో టీచర్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం గుంటూరు నగరంలోని ఆంధ్ర క్రిస్టియన్ (ఏసీ కళాశాలలో) ప్రారంభమైంది.



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

సర్టిఫికెట్ల పరిశీల కోసం విద్యాశాఖ మొత్తం 28 కమిటీలను ఏర్పాటు చేసింది . ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పరిశీలన కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగింది. తొలుత కొన్ని సాంకేతిక కారణాలవల్ల వల్ల పరిశీలన ఆలస్యమైనప్పటికీ మధ్యాహ్నం నుంచి ఊపందుకుంది. మెగా డీఎస్సీలో ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన మొత్తం 1143 మంది అభ్యర్థులకు గాను తొలిరోజు 932 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పూర్తి చేసినట్లు డీఈఓ సీవీ రేణుక వెల్లడించారు.మొత్తం 28 కమిటీల్లో ఒక్కో కమిటీకి 50 మంది అభ్యర్థులను కేటాయించి పరిశీలన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. ఇలా ఉంటే సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమానికితి ఆర్జేడీ లింగేశ్వర్ రెడ్డి తో పాటు బాపట్ల డీఈఓ పురుషోత్తం ,పల్నాడు డీఈవో చంద్రకళ తో పాటు ఎంఈఓ లు హాజరయ్యారు.

కేంద్రం బయట అభ్యర్థుల బంధువుల కోలాహలం

మెగా డీఎస్సీ సర్టిఫికెట్ పరిశీలనకు వచ్చిన అభ్యర్థులతో పాటు వారి బంధువులు, కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఏసి కళాశాలలోని సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రం వద్ద కోలాహలం నెలకొంది. కొంతమంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలన కోసం కేంద్రంలోకి వెళ్తూ పిల్లల్ని కుటుంబ సభ్యులు, బంధువులు వద్ద వదిలి వెళ్లారు. భార్యాభర్తల్లో ఒకరికి, ఉద్యోగం రాగా మరొకరు పిల్లల్ని సముదాయించుకుంటూ కేంద్రం కేంద్రం వద్ద కనిపించారు. భార్యాభర్తలిద్దరికీ ఇద్దరికీ ఉద్యోగాలు వచ్చినవారు పిల్లల్ని కుటుంబ సభ్యులకు అప్పగించి వెళ్ళడం కనిపించింది.



కమిటీ వద్ద సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకుంటున్న డీఎస్సీ అభ్యర్థి

దరఖాస్తు చేయకుంటే మీ సంగతి చూస్తాం

- అసోసియేషన్ నేతలతో ఎక్సైజ్ అధికారుల హెచ్చరికలు
- బార్లకు నేటితో ముగియనున్న గడువు.. వ్యాపారులతో చర్చలు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బార్లకు పెద్దఎత్తున దరఖాస్తులు చేయండి.. లేకపోతే మీ సంగతి చూస్తాం అంటూ ఎక్సైజ్ అధికారులు మద్యం అసోసియేషన్ నాయకులను బెదిరించారని సమాచారం. బార్ల లైసెన్సులకు గడువు పొడిగిస్తున్నా దరఖాస్తు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. తాజాగడువు శుక్రవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో గురువారం గుంటూరులోని ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం అసోసియేషన్ నాయకులతో అధికారులు చర్చలు జరిపారు. బార్ల పాలసీ నష్టంచేకూరేలా ఉందంటూ, అందుకే తాము దరఖాస్తు చేయలేకపోతున్నామని అసోసియేషన్ నాయకులు అధికారులకు తెలిపారు. అదేం కుదరదు మీరు విరివిగా బార్లకు దరఖాస్తు చేయకపోతే.. వైన్ షాపులను ఏవిధంగా నిర్వహిస్తారో చూస్తామంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారని తెలిసింది. అసోసియేషన్ గుమస్తా మణికుమార్‌ను విజయవాడ ఎస్టీఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకుని బెదిరించినట్లు తెలిసింది. బార్లకు దరఖాస్తులు చేయకపోతే వైన్ షాపులపై కేసులు పెడతామని హెచ్చరించినట్లు సమాచారం. నిబంధనలను కఠినతరం చేస్తామని తేల్చిచెప్పినట్లు తెలిసింది. అయినా కూడా తాము ఏమీ చేయలేమని.. ప్రస్తుత పాలసీ తీవ్రంగా నష్టాలు వచ్చేటట్లుగా ఉందని.. బార్లకు దరఖాస్తు చేయలేమని అసోసియేషన్ నాయకులు అధికారుల ఎదుట స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో బార్లకు దరఖాస్తు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాకపోతే ఏమి చేయాలంటూ అధికారులు తల పట్టుకుంటున్నారు.

తెలుగు వెలుగు మసకబారుతుందా..?!

- తెలుగు భాషాభిమానులు ఆందోళన
- భాషాభివృద్ధికి ప్రభుత్వాలు పూనుకోవాలి
- నేడు తెలుగు భాషా దినోత్సవం

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దేశభాషలందు తెలుగు లెస్స. అని విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు తెలుగుభాష ఔన్నత్యాన్ని కీర్తించారు. మహోజ్వలమైన సాహిత్యంతో తెలుగుభాష విశ్వఖ్యాతిని పొందింది. పద్యంతో ఏ భాషకు లేని విశిష్టత తెలుగుభాష సొంతం చేసుకుంది.. అవధాన ప్రక్రియ తెలుగుభాషకే సొంతం.. వేల ఏండ్ల ఘన చరిత్రగల తెలుగుభాష వెలుగులు ఇంగ్లీషు ధాటికి, ఇంటర్నెట్ తాకిడికి మసకబారుతుందా? అంటే భాషావేత్తలు అవుననే చెబుతున్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియం ఎత్తివేయడం భాష మనుగడకు గొడ్డలి పెట్టని భాషాభిమానులు చెప్తున్నారు. కూటమి ప్రభుత్వం పాఠశాలలో తెలుగు మీడియంను పునరుద్ధరిస్తుందని అనుకున్న భాషవేత్తల ఆశలు అడియాశలయ్యాయి. ప్రభుత్వాలు పూనుకుని తెలుగు భాషాభివృద్ధికి చర్యలు తీసుకోకపోతే భాష మనుగడ ప్రశ్నార్థకం అవుతుందంటున్నారు.

ప్రభుత్వాలు పూనుకోవాలి



● డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి

ఏ భాష అయినా ప్రచారంలో ఉండాలంటే, సజీవ భాషగా నిలవాలంటే మొదటగా దానిని ఆదరించాల్సింది ప్రభుత్వమే. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేసి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తుందన్న నమ్మకం ఉంది.

తెలుగుభాష అభ్యున్నతికి మాన్‌సింగ్ నాయక్ కృషి



కారంపూడి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష అభ్యున్నతికి మాన్‌సింగ్‌నాయక్ విశేషంగా కృషి చేస్తున్నారు. బొల్లాపల్లి మండలం హనుమాపురంనకు చెందిన బాణావత్ మాన్‌సింగ్‌నాయక్ కారంపూడిలో ఎంపీపీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తెలుగుభాషను బతికించాలనే లక్ష్యంతో గేయాలు, కథలు చిన్నచిన్న పుస్తకాలు ప్రచురించి విద్యార్థులకు అందిస్తున్నారు. సుమారు 2వేల పుస్తకాలను సేకరించి పాఠశాలలో గ్రంథాలయం కూడా ఏర్పాటుచేశారు. మాన్‌సింగ్ నాయక్ సేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ సర్వశిక్ష అభియాన్ 2021లో చదవడం మాకిష్టం అనే పథకం కింద జిల్లా కోఆర్డినేటర్‌గా ఎంపిక చేశారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీకి ఉమ్మడి గుంటూరు జిల్లా ఎక్స్‌పర్ట్ టీచర్‌గా ఎంపిక చేశారు.

హద్దులు దాటిన యూరియా దందా

(5వ పేజీ తరువాయి)

ఎక్కువగా యూరియా నిల్వలు తెలంగాణకు వెళ్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సరిహద్దు ప్రాంతాల నుంచి వందల టన్నుల యూరియా తెలంగాణకు తరలి వెళ్తుంది. రూ.266.50 యూరియా బస్తాను వ్యాపారులు బోగస్ రైతుల పేర్లతో దళారులకు విక్రయిస్తున్నారు. వారు అదే యూరియాను తెలంగాణకు తీసుకువెళ్లి రూ.850కి విక్రయిస్తున్నారు. ఫలితంగా సకాలంలో ఎరువులు దొరక్క రైతులు అల్లాడి పోతున్నారు. రెండు నెలలుగా పల్నాడు జిల్లా కారంపూడి అడ్డాగా గుట్టుగా సాగుతున్న ఎరువుల దందాను విజిలెన్స్ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం కాంతనపల్లికి చెందిన సఖినాల సురేష్ రెండు నెలలుగా యూరియాను పక్కదారి పట్టిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కారంపూడికి చెందిన నంద్యాల నాగరాజును మధ్యవర్తిగా నియమించుకుని సురేష్ ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. కారంపూడికి చెందిన నీరజ లక్ష్మీవెంకట సత్యనారాయణ కమర్షియల్ కార్పొరేషన్ యజమాని ఆతుకూరి నరసింహారావు వీరికి సహకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కారంపూడి, మాచర్ల ప్రాంతాలకు చెందిన రైతుల పేర్లతో బిల్లులు రాని విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. దాచేపల్లి మండలంలోని పొందుగుల చెక్‌పోస్టు వద్ద బుధవారం అర్ధరాత్రి సురేష్, బొలగనా సుధీర్ అనే వ్యక్తులు రెండు వాహనాల్లో తరలిస్తున్న 165 బస్తాల యూరియాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

తెనాలి రైల్వే స్టేషన్‌కు విద్యుత్ కాంతులు

- ప్రయాణికులను ఆకట్టుకుంటున్న విద్యుత్ కాంతులు

తెనాలి అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వే స్టేషన్ ముఖద్వారం విద్యుత్ కాంతుల సోయగం ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. ప్రైవేటు భవనం కాదు ఇది తెనాలి రైల్వే స్టేషన్ అంటూ ప్రయాణికులు మురిసిపోతున్నారు. స్టేషన్ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన అన్ని రంగుల లైట్లు ప్రత్యేక అందాన్ని తెచ్చిపెట్టాయి. ముఖ్యమైన రోజుల్లో మాత్రమే ఈ లైట్లను వెలిగిస్తున్నారు. వినాయక చవితి పర్వదినాన రైల్వే స్టేషన్ ఇలా వెలిగిపోతుంది. మరో పక్క కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమృత్ భారత్ పథకంలో రూ27 కోట్లతో చేస్తున్న పనులు పూర్తయితే తెనాలి రైల్వేస్టేషన్ రాష్ట్రంలోనే ఓ మోడల్‌గా సౌకర్యాలతో ప్రయాణికులను అలరించనుంది.





యూరియా కోసం బారులు

(5వ పేజీ తరువాయి)

యూరియా నిల్వలు ఇప్పటికే సరఫరా చేశాం.. కావాలంటే గణాంకాలే రుజువని వ్యవసాయశాఖ చెబుతోంది. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం భిన్నంగా కనిపిస్తున్నాయి. ఖరీఫ్ అవసరాల్లో ఇప్పటికే దాదాపు 60శాతం యూరియా కేటాయించినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. కానీ రైతులకు మాత్రం వెతలు తప్పడం లేదు. పంపిణీలో అధికశాతం రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా పక్కదారి పడుతుండగా ఇదే అవకాశంగా వ్యాపారులు యూరియాను బ్లాక్‌చేసి సమస్యను తీవ్రం చేస్తున్నారనే విమర్శలున్నాయి. యూరియా కోసం రైతులు ఇబ్బందిపడకూడదని, ఎరువుల అక్రమాలపై విజిలెన్స్ దాడులు ముమ్మరం చేయాలని తాజాగా సీఎం చంద్రబాబు ఆదేశించారు. అయినా వ్యాపారులు యూరియాను బ్లాక్ చేసి విక్రయిస్తున్నారు. 45 కిలోల యూరియా బస్తాను రూ.266లకు అమ్మాల్సి ఉండగా రూ.400 వరకు అమ్ముతూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. కాదంటే నానో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు తీసుకున్న వారికే యూరియా అని మెలిక పెడుతున్నట్లు తెలుస్తోంది.

మునక కారణమెలా...

ఇటీవల కురిసిన వర్షాల ధాటికి అనేక ప్రాంతాల్లో వరి ముంపు బారిన పడింది. దీంతో పైరు కాపాడుకోవడానికి రైతులు రెండోసారి యూరియా వాడాల్సి వచ్చింది. కుళ్లిపోయే దశలో ఉన్న పైరును కాపాడుకోవడానికి రైతులు ఎకరాకి బస్తా యూరియా చల్లాల్సి వచ్చింది. యూరియా ఇక్కట్లకు ఇది కూడా ఒక కారణమని అధికారులు చెప్తున్నారు. అయితే రెండోసారి యూరియా రైతులు వేస్తున్నా కేటాయించిన నిల్వల లెక్కల ప్రకారం సమృద్ధిగానే ఉండాలి తప్ప కొరత ఎందుకొచ్చిందనే దానికి అధికారులే సమాధానం చెప్పాలి.

పరపతి ఉన్నవారికే..

పీఏసీఎస్‌లు, ఆర్‌ఎస్‌కేల్లో రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా యూరియా అందిస్తున్నారనే విమర్శలున్నాయి. నిబంధనల ప్రకారం రైతులకు పంపిణీ జరగాల్సి ఉండగా, పరపతి గల రైతులకు పెద్దమొత్తంలో యూరియా కేటాయిస్తున్నారు. పలుకుబడి ఉన్న వారు అవసరం లేకపోయినా 20 నుంచి 30 బస్తాలు నాయకుల సిఫార్సుతో తీసుకుంటున్నారు. దీని వల్ల తమ దాకా వచ్చేసరికి కొరత ఏర్పడుతుందని చిన్న, సన్న కారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఏసీఎస్‌లకు నిల్వల కేటాయింపులతోనే అధికారులు సరిపెడుతున్నారు తప్పితే వాటిని రైతులకు చేర్చేవరకు పర్యవేక్షణ లేకుండా పోతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల అయితే ఏకంగా స్థానికంగా ఉన్న నేతలే యూరియా పంపిణీ బాధ్యతలు తీసుకుని తమకు తోచిన విధంగా ఇస్తున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పారిశుధ్యంపై అవగాహన

వినుకొండటౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వినుకొండ మండలంలోని గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్‌కు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పుట్టారెడ్డి మాట్లాడుతూ శానిటేషన్‌పై గ్రామంలో అవగాహన కల్పించామన్నారు. అసిస్ట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామం ఆరోగ్యంగా ఉండాలం టే గ్రీన్ అంబాసిడర్స్ క్లాప్ మిత్రల ద్వారా గ్రామంలో తడి పొడి ప్రమాదకర చెత్త నిర్వహణ జరగాలన్నారు. పంచాయ తీ సర్పంచులు, కార్యదర్శులు శ్రద్ధ తీసుకున్నప్పుడే గ్రామం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు

నేడు చీఫ్‌విప్ కార్యాలయంలో ప్రజాదర్బార్

వినుకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కొత్తపేటలోని ప్రభుత్వ చీఫ్‌విప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యాలయం సిబ్బంది గురువా రం ఒక ప్రకటనలో తెలిపారు. కావున నియోజకవర్గం ప్రజలు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజ నేయులును కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు.

'తెలుగు భాషా దినోత్సవానికి ఆహ్వానం'

వినుకొండటౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కవయిత్రి అమృతపూడి రేవతిని నరసరావుపేటలో ఈ నెల 31వ తేదీన నిర్వహిస్తున్న తెలుగు భాషా దినోత్స వానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించినట్లు ఆమె ఒక ప్రకటన లో తెలిపారు.

నేడు మున్సిపల్ సమావేశం

వినుకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మొత్తం 33 అంశాలను చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు.

పొగాకు సాగు చేయరాదు : ఏవో వరలక్ష్మి

వినుకొండటౌన్, ఆగస్టు 28, (ఆంధ్రజ్యోతి) మండలంలోని తిమ్మాయిపాలెంలో మండల వ్యవసాయ అధికారి వరలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమంలో బాగంగా వరలక్ష్మి రైతులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులు పొగాకు పంటలు పండించ రాదని, పొగాకుకు ప్రత్యామ్నాయంగా సజ్జ, కంది, ఆము దం, వసతి గల భూముల్లో ముక్క జొన్న పంటలు పండించాలని తెలిపారు. సీసీఆర్ కార్డు పొంది పంట నమోదు చేసుకున్న రైతులకు అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి పొందవచ్చని తెలిపారు.

రొంపిచర్ల ఎంఈవో-1గా యశోధర

రొంపిచర్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల ఎంఈవో - 1గా యశోధర గురువారం నియమితులయ్యారు. ఆమె వినుకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల గ్రేడు- 2 ప్రధానోపాధ్యాయినిగా పని చేస్తున్నారు. గతంలో ఎంఈవో -1 గా ఉన్న అనీల గుంటూరు వెస్ట్- 1వ ఎంఈవోగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా యశోధరను ఎంఈవో-2 బ్రహ్మేశ్వరరావు, మండల వనరుల కేంద్ర సిబ్బంది సన్మానించారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.8.3 లక్షలు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సపాలెంలో ఉన్న మహంకాళి అమ్మవారి దేవస్థానం నందు గడిచిన నాలుగునెలల హుండీ లెక్కింపు కార్యక్ర మం గురువారం నిర్వహించారు. హుండీల ద్వారా రూ.764091, అన్నదానం హుండీ ద్వారా రూ.66,831 మొత్తం రూ.830,922.00 వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి నలబోతు మాధవీదేవి తెలిపారు. కార్యక్రమంలో బృందం వారు, పర్యవేక్షకులుగా ఇన్‌స్పెక్టర్ మంజుష, దేవదాయ శాఖ అధికారులు, భక్తులు, సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి న్యాయ విజ్ఞాన సదస్సులు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీల్లో న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహించనున్నట్లు స్థానిక ప్రధాన సీనియర్ సివిల్ న్యాయాధికారి మధు స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయ విజ్ఞాన సదస్సులు నకరికల్లు మండలం రూపెనగుంట్ల, ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో సాయం త్రం ఐదున్నర గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

యూరియా నిల్వల పరిశీలన

చిలకలూరిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల అధికారులు గురువారం పట్ట ణంలో పలు చోట్ల తనిఖీలు జరిపి యూరియా నిల్వలను పరిశీలించారు. ఎరువుల విక్రయ దుకాణాలు, గిడ్డంగుల్లో రికార్డులను తనిఖీ చేశారు. అన్నీ సక్రమంగానే ఉన్నట్టు గుర్తించారు. తనిఖీలలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్ రమేష్ బాబు, తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్, ఏవో సీహెచ్ సరిత, ఎస్ఐ చెన్నకేశవులు పాల్గొన్నారు.

సీడ్ పథకాన్ని పేదలంతా సద్వినియోగించుకోవాలి

● బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు

శావల్యాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సంచార, అర్ధసంచార జాతుల పేదల కోసం కేం ద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీడ్ పథకాన్ని అందరూ సద్వినియోగించుకోవాలని బీజేపీ శావల్యాపురం మండల అధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. సంచార, అర్ధ సంచార జాతుల విముక్త దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ కేంద్ర, రాష్ట్రకమిటీల ఆదేశాల మేరకు మండలంలోని వెలమావారిపాలెం, శావల్యాపురం, మతుకుమల్లి గ్రామాల్లోని యానాది కాలనీ ల్లో గురువారం స్ఫూర్తి ర్యాలీని నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 30న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో విజయవాడలో జరగనున్న స్ఫూర్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వైభవంగా గణపతి ఉత్సవాలు



ఎస్పీ కార్యాలయంలో ప్రతిష్ఠించిన మట్టి గణపతి విగ్రహానికి ఎస్పీ కంచి శ్రీనివాసరావు పూజలు



జీవీ నివాసం వద్ద ఏర్పాటు చేసిన వినాయకునికి పూజలు చేస్తున్న చీఫ్‌విప్ జీవీ దంపతులు

నరసరావుపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట పట్టణం, గ్రామల్లో గణపతి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపా ల్లో గణపతి భారీ విగ్రహాలను ప్రతిష్ఠించి విశేషంగా పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గణపతి విగ్రహాలను దర్శించుకొని పూజలు చేస్తున్నారు. పట్టణంలోని మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్, కాకుమాను వారి వీధి, మెడికల్ అసోసియేషన్ అధ్వర్యంలో శ్రీరాంపురంలో, యంగ్‌స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్యాంక్ బజారులో భారీ గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. గడియార స్తంభం సెంటర్, శివుని విగ్రహం సెంటర్, పెద చెరువు, ప్రకాష్ నగర్, రామిరెడ్డిపేట, బరంపేట, గుంటూరు రోడ్డు, కోటప్పకొండ రోడ్డు, మెయిన్ రోడ్డు, ఎన్‌జీవో కాలనీ, రెడ్డినగర్, పలు అపార్ట్‌మెంట్‌లలో, విద్యా సంస్థలు, తదితర ప్రాంతాలలో గణపతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

● పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం వినాయక చవితి ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎస్పీ కంచి శ్రీనివాసరావు విగ్రహాన్ని ఏర్పాటు చేసిన పోలీస్ సిబ్బందిని అభినందించారు. శుభాకాంక్షలు తెలిపారు.

● రొంపిచర్ల మండలంలోని గ్రామాల్లో వినాయక చవితి పర్వదినాన్ని బుధవారం భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. వరసిద్ధి విఘ్నేశ్వర స్వామి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. సాయంత్రం భజనా కార్యక్రమాలను నిర్వహించారు.

● వినుకొండటౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వినాయక చవితి పం డుగను భక్తులు ఘనంగా నిర్వహించారు. వేల రూపాయలు వెచ్చించి యువకులు ఉత్సాహంగా విగ్రహాలను కొనుగోలు చేసి వీధివీధిన విగ్రహాలను ఏర్పాటు చేసి వినాయక చవితి వేడుకలను అంగరంగవైభవంగా నిర్వహించారు. పట్టణంతో పాటు రూరల్‌లో మొత్తం 149 విగ్రహాలకు పోలీసులు అనుమతినిచ్చారు. ఈ నెల 29వ తేదీ నుంచి కొన్ని విగ్రహాలను నిమజ్జనానికి తరలించేందుకు భక్తులు ఇప్పటికే సన్నద్ధమవుతున్నారు.

● నూజెండ్ల మండలంలో 56 చోట్ల ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి ఆకర్షణీయమైన వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండలంలోని ఆరు వినాయక విగ్రహాలను గుండ్లకమ్మ నదిలో నిమజ్జనం చేశారు.

● ఈపూరు మండలంలో 55 వినాయకుని విగ్రహాల ఏర్పాటుకు అనుమతినిచ్చారు

● బొల్లాపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెల్లటూరులోని బ్యాంకు బజారు లో భారీ గణనాధుడిని ఏర్పాటు చేసి కంఠంరాజు యోగేశ్వరరావుచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

● నాదెండ్ల మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాగా ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, యార్డు చైర్మన్ షేక్ కరీముల్లాలు నాదెండ్ల సమీపంలోని నందికుంట విఘ్నేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ విఘ్నేశ్వర ట్రాక్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ట్రాక్టర్ల ర్యాలీతో కుప్పగింజి వాగులో నిమజ్జనం చేశారు.

● యడ్లపాడు మండలంలో వినాయకచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే ఆధ్యాత్మిక శోభతో ఆలయాలు, మండపాలు కళకళలాడాయి. వివిధ రంగులు, కళాకృతులతో తయారుచేసిన వినాయక విగ్రహాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



శ్రీరాంపురంలోని మెడికల్ అసోసియేషన్ మండపంలో భారీ గణపతి విగ్రహానికి పూజలు, గణపతిని దర్శించుకుంటున్న భక్తులు

నిమజ్జనాల ప్రదేశాల్లో పటిష్ఠమైన చర్యలు

● డీఎస్పీ వెంకటరమణ

శావల్యాపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయకుని విగ్రహాల నిమజ్జనాలు జరిగే ప్రదేశాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని డీఎస్పీ వెంకటరమణ స్థానిక పోలీస్ అధికారులను ఆదేశించారు. శావల్యాపురం మండలం గంటవారిపాలెం సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద ఏర్పా టు చేసిన నిమజ్జన ప్రదేశాన్ని డీఎస్పీ వెంకటరమణ గురువారం పరిశీలించారు. నిమజ్జన ప్రదేశాలను పోలీసుసిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. వినుకొండ రూరల్‌సీఐ ప్రభాకర్‌రావు, ఎస్ఐ లోకేశ్వరరావు, కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.



నూజెండ్లలో పూజలందుకుంటున్న గణనాథుడు

విద్యుత్ చార్జీలపై వామపక్షాల నిరసన



శివయ్య స్తూపం సెంటర్లో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష పార్టీ నాయకులు

వినుకొండ టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బషీర్‌బాగ్ అమరవీరుల సాక్షిగా విద్యుత్ బిల్లులు తగ్గించాలని మరో ఉద్యమాన్ని కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ తెలిపారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గురువారం స్థానిక శివయ్య స్తూపం సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెంచిన కరెంట్ చార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపును మానుకోవాలని, సోలార్ ఎనర్జీ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలరావు, సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్లకు ఘన స్వాగతం



ర్యాలీలో ప్రజలకు అభివాదం తెలుపుతున్న గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అమెరికా పర్యటన ముగించుకొని గురువారం నరసరావుపేటకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నకరికల్లు అడ్డరోడ్డు నుంచి నరసరావుపేట టౌన్ హాల్ వరకు కూటమి నాయకులు. కార్యకర్తలు వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. నకరిక ల్లు అడ్డరోడ్డులో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని గోనుగుంట్లకు స్వాగతం పలికారు. ఆంజనేయ స్వా మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అర్చకుల ఆశ్వీరవచనా లు తీసుకున్నారు. అక్కడ నుంచి ర్యాలీ బయలు దేరి రావిపాడులోని ఎన్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కార్యక్రమంలో కుమ్మెత కోటిరెడ్డి, జల్లిపల్లి శేషమ్మ, బీజేపీ రంగిశెట్టి రామకృష్ణ, టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మన్నాన్ షరీఫ్, మాజీ ఎంపీపీ మొండితోక రామారావు, వీరయ్యచౌదరి, గుత్తా అంకమ్మ చౌదరి, తెలుగుయువత నాయకుడు పోనుగోటి శ్రీనివాసరావు, జనసేన మిరియాల వెంకట సుబ్బమ్మ, కనుమూరి లక్ష్మి, గట్టుపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని పలు గ్రామాల టీడీపీ నాయకులు గోనుగుంట్లకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వడ్లమూడి వెంకట కిషోర్ పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రెయిన్లతో పారిశుధ్యం మెరుగు

● పైలెట్ ప్రాజెక్టుగా గుండేపల్లి పంచాయతీ ఎంపిక ● డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి

ఈపూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మ్యాజిక్ డ్రెయిన్స్‌తో పారిశుధ్యం మెరుగుదలతో పా టు ఖర్చు కూడా తగ్గుతుందని డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి అన్నారు. జిల్లాలో నాలుగు పం చాయతీలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయగా.. వినుకొండ క్లస్టర్ ఈపూరు మండలం గుండేపల్లి పంచాయతీని ఎంపిక చేశారన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గుండేపల్లి పంచాయతీలో మురుగు కాలువలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సాధారణంగా నిర్మించే సైడ్ డ్రెయిన్స్ కంటే ఐదు రెట్లు ఖర్చు తగ్గుతుంది. మురుగునీరు నిల్వ ఉండదు. చిప్స్‌తో రెండు లేయర్‌లను ఏర్పాటు చేయడంతోపాటు మధ్యలో ఇంకుడు గుంతలను నిర్మిస్తారన్నారు. దానివల్ల మురుగు నీరు భూమిలో ఇంకుతాయని, భూ గర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. ఆయనతో పాటు ఏపీవో పుష్పరాజ్, టీసీలు రోజా, నారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరావులు ఉన్నారు.



గుండేపల్లిలో మురుగు కాలువలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి

పండ్ల తోటలతో అధిక ఆదాయం

మండలంలో ఉపాధి హామీ పథకం కింద సాగు చేస్తున్న పండ్ల తోటలను గురువారం డ్వామా పీడీ సందర్శించారు. గుండేపల్లిలో సాగు చేస్తున్న తైవాన్ జామ తోటను పరిశీలించారు. అధిక దిగుబడికోసం తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందని, అవకాశాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి సంగం డెయిరీ తోడ్పాటు

● మేనేజర్ జానకి రామయ్య

వయ్యకల్లు (శావల్యాపురం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులకు వివిధ రకాల రాయితీలు, బోనస్‌లు అందజేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి సంగండెయిరీ ఎంతో తోడ్పాటు నందిస్తుందని వినుకొండ సంగం డెయిరీ మేనేజర్ మక్కెన జానకి రామయ్య అన్నారు. మండలంలోని వయ్యకల్లులో సంగండెయిరీ వెండార్ సెంటర్లో గురువారం బోనస్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెంటర్లోని 18మంది పాలఉత్పత్తిదారులకు మొత్తం రూ.68,404లను బోనస్‌లుగా పంపిణీ చేశారు. కేంద్రం అధ్యక్షుడు గోరింట్ల యోగయ్య, సూపర్‌వైజర్ మూరబోయిన ప్రసాద్, నాయకులు నడింపల్లి చినలక్ష్మయ్య, కాపూరి రామారావు, దారా వీరాంజనేయులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

సందెపూడిలో ఇరువర్గాల ఘర్షణ

యడ్లపాడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సందెపూడిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. గురువారం గ్రామంలో మూడు చోట్ల ఇళ్ల శ్లాబులు వేసుకుంటున్నారు. ఒక వర్గీయుల వీధిలో మరో వర్గానికి చెందిన సీహెచ్ శ్రీనివాసరావు ఇంటి శ్లాబు వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. అయితే ఇంటి పక్కగా విద్యుత్ తీగెలు వెళుతుండడంతో తీగెలు తగిలి ప్రమాదం జరగవచ్చన్న ఉద్దేశంతో విద్యుత్ లైన్‌మెన్ భాస్కర్‌కు తెలిపి సరఫరా నిలిపివేయాలని కోరాడు. లైన్‌మెన్ వచ్చి శ్లాబు వేస్తున్న ప్రాంతాన్ని, విద్యుత్ తీగెలను పరిశీలించి సరఫరాను నిలిపివేశాడు. దీనితో గ్రామంలో ఓ మండపానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తాము ఎంతో వ్యయం చేసి కార్యక్రమం జరుపుతుంటే విద్యుత్ సరఫరా నిలిపివేయిస్తావా..అంటూ శ్రీనివాసరావుపైకి ఓ యువకుడు దాడిచేశాడు. అంతేగాకుండా లైన్‌మెన్‌ను కూడా బెదిరించాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న గ్రామ సర్పంచ్ సర్ది చెప్పే ప్రయత్నం చేయబోగా అతనిపై దాడికి పాల్పడ్డాడు. దీనితో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం నెలకొని ఘర్షణకు దారితీసింది. యువకుడిపై సర్పంచ్ వర్గీయులు కూడా దాడి చేశారు. సమాచారం అందడంతో ఎస్ఐ శివరామకృష్ణ సిబ్బందితో కలసి గ్రామానికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపివేశారు. యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా సర్పంచ్ వర్గీయులు తమ మండపాన్ని ధ్వంసం చేశారని యువకుడి తరపు వర్గీయులు ఆరోపించారు. అయితే ఓ రైతు పొలానికి ట్రాక్టర్‌ను తీసుకెళుతుండగా మండపం ఉన్న వీధిలో అన్నదానం జరుగుతుండడంతో వెళ్లేందుకు వీలుకాక ట్రాక్టర్‌ను మరో మార్గంలోకి తీసుకెళ్లేందుకు వెనక్కి తిప్పుతున్న క్రమంలో ట్రాక్టర్ వెనుక భాగం మండపం లైటింగ్ దుంగకు తగిలి కూలిపోయి దండలు తెగిపోయాయని, ఎవరూ దాడిచేసి పగుల గొట్టలేదని స్థానికులు తెలిపారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేత విషయంలో ఇరువర్గాల మధ్య స్వల్ప ఘర్షణ తలెత్తిన మాట వాస్తవమేనన్నారు. ఘటనకు సంబంధించి శ్రీనివాసరావు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఫౌండేషన్ డైరెక్టర్ గోనుగుంట్ల హరీశ్ దంపతులు

సూపర్‌సిక్స్‌తో అందరిచూపు ఏపీ వైపు

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అప్పుల మధ్య కూ డా సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌హిట్ చేయడంతో దేశంలోని అన్ని రాష్ట్రాల చూపు ఏపీ వైపే నిలిచిందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. 5ఏళ్లలో వైసీపీ చేయలేని ఎన్నో పనులు చంద్రబాబు చేయడంతో జగన్ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. వినుకొండ పురపాలక సంఘం కార్యాలయం వద్ద శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన బస్ షెల్టర్‌ను శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ, శివశక్తి ఫౌండేషన్ డైరెక్టర్ గోనుగుంట్ల హరీశ్, సత్యకృష్ణ దంపతులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు, ప్రయాణికు ల అవసరాలు దృష్టిలో పెట్టుకుని బస్ షెల్టర్లను నిర్మించామన్నారు. వినుకొండలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఒక్క బస్‌షెల్టర్ అయినా కట్టారా అని ప్రశ్నించారు. కొండపై రామలింగేశ్వర స్వామి ఆలయం ఘాట్ రోడ్‌కు కొత్తగా నిధులు మంజూరయ్యాయని త్వరలో టెండర్లు పిలిచి పనులు చేపడతామని, వినుకొండ మంచినీటి పథకాన్ని 2ఏళ్లలో పూర్తి చేసి చూపిస్తామన్నారు. జీవీ కుమారుడు హరీష్ మాట్లాడుతూ శివశక్తి ఫౌండేషన్ ద్వారా పట్టణంలో మొత్తం 5 బస్ షెల్టర్ల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఫౌండేషన్ ద్వారా ఒక పరిశ్రమ స్థాపించి డిగ్రీ పూర్తి చేసిన స్థానిక యువతకు ఉద్యోగాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు జీవీ, లీలావతి దంపతుల సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల కేసుల పరిష్కారంపై దృష్టిపెట్టాలి

● ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి వినతి



సీఎంను కలిసి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో టీడీపీ శ్రేణులపై నమోదైన అక్రమ కేసుల పరిష్కారంతో పాటు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నియోజకవర్గ అబివృద్ధికి సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం సీఎం చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. అమరావతి సెక్రటేరియట్‌లో సీఎంను ఆయన కలిశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు, సీఎంఆర్‌ఎఫ్ సాయంపై ఉదారంగా వ్యవహరించాలని సీఎంని కోరారు. టీడీపీ శ్రేణులపై తప్పుడు కేసులు నమోదు చేశారని, వాటి విచారణలో భాగంగా ఇప్పటికీ కోర్టులకు హాజరవుతున్నట్లు ప్రత్తిపాటి ముఖ్యమంత్రికి తెలియచేశారు. గురువారం కూడా 54 మంది వరకు కోర్టుకు హాజరయ్యారని చెప్పారు. చిలకలూరిపేట పట్టణాభివృద్ధితో పాటు, మున్సిపల్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి సకాలంలో నిధులు అందేలా చూడాలని ఆయన సీఎంను కోరారు. త్వరగా నిధులు అందేలా చూస్తానని, పట్టణాభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపుపై కూడా కేంద్రమంత్రితో మాట్లాడతానని సీఎం తెలియచేసినట్టు ప్రత్తిపాటి తెలిపారు. దీనిపై సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు.

రూ.21 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని 29 మందికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.21లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం ఆర్‌ఎఫ్) చెక్కులను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తన నివాస గృహంలో గురువారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన రూ.1.25 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మాంసం, చేపల విక్రయ దుకాణ సముదాయ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్‌యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నాం

● సీఐ ప్రభాకర్

నూజెండ్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐనవోలు గ్రామంలో ఈ నెల 23వ తేదీ న జరిగిన ఇరు కుటుంబాల ఘర్షణలో కేసులు నమోదులో పక్షపాత దోరణి ప్రదర్శించకుం డా సమన్వయం పాటించామని వినుకొండ రూరల్ సీఐ బీ ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని రూరల్ పోలీసు కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీఐ ప్రభాకర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు పోలేరమ్మ జాతరలో చందా వసూలు విషయంలో జరిగిన వాగ్వాదం, ఘర్షణలో ఇష్టానుసారం తగదన్నారు. భీమనాధం వెంకటప్రసాదు తండ్రి గురవయ్య ఫిర్యాదు మేరకు.. కొమ్మా గోపీ నాగేశ్వర్‌కు గాయా లై ఆస్పత్రి నుంచి నివేదిక వచ్చిన సందర్భంగా దాడికి పాల్పడిన ఇరు కుటుంబాల వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహ రించి గ్రామాల్లో శాంతియుత వాతావరణంలో ప్రజలు జీవనం సాగించే విధంగా చూడాలని, కక్షలు, కార్పణ్యాలు పెంచేందుకు ప్రయత్నించకూడదన్నారు. కార్యక్రమంలో ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవి

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

రొంపిచర్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి గురువారం తెలిపారు. ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆస్పత్రిలోని విభాగాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో చంద్రన్న సంచార చికిత్స జిల్లా నోడల్ అధికారి డాక్టర్ హనుమకుమార్, వైద్యాధికారి నిమ్మల సాయిబాబు పాల్గొన్నారు.